# మనసొంపుగా



## ప్రయాణం ఇలా...

"అబ్బబ్బ! ఇంకా ఎంత దూరమే?" అడిగాను కోపంగా.

"బోడి! ఈ మాత్రానికే అలసిపోతే ఎలా? ఎంత దూరమైనా నడుస్తానంటూ కోతలు కోశావుగా! నడు" అంది ప్రజ్ఞ.

"ఏదో బుద్ధితక్కువై అన్నాను. ఇక నావల్ల కాదు బాబోయ్!" అంటూ కూర్చోవడానికి ఏదైనా వుందేమోనని అటు ఇటు చూశాను.

"ఇపుడు బుద్ధొచ్చిందా! అయినా ప్రయోజనం లేదు. ఇపుడు మనం సరిగ్గా మధ్యలో వున్నాం. మనం వెళ్ళాల్సిన చోటుకైనా, తిరిగి ఇంటికి వెళ్ళాలన్నా ఒకటే దూరం" అంది ప్రజ్ఞ.

"అమ్మో! ఇంకా వచ్చినంత దూరం నడవాలా?.. హమ్మ. కాసేపు ఆగవే!" అంటూ రోడ్డు ప్రక్కనే వున్న చిన్న రాయి మీద చతికిలపడ్డాను.

ప్రజ్ఞ కూడా నా పక్కనే పచ్చగడ్డిమీద కూర్చుంది.

"ఆహా! ఇక్కడెంత హాయిగా వుంది! ఇక్కడే వుండిపోవాలనిపిస్తోంది" అన్నాను ఆహ్లాదకరమైన పరిసరాలను అవలోకిస్తూ.

అది ఓ అందమైన సాయంత్రం వేళ. పల్లెటూరుకు దూరంగా పొలాల మధ్య వున్న డొంక రోడ్డు. వేసవి తాపాన్ని చల్లబరుస్తూ రివ్వున వీస్తున్న చల్లని గాలి. ఆకాశంలో ఆనందంగా బారులుతీరి షికారుచేస్తున్న పక్షులు. క్రితం వారం రెండు, మూడుసార్లు పడిన వర్షపు జల్లులతో జీవం పోసుకుని పచ్చగా కళకళలాడుతూ– డొంక పక్కనే తివాచీ పరచినట్టున్న పచ్చిక. నీరు లేక ఎండిపోయిన పంట కాలువ. అప్పుడు సుదూరంగా వినిపించే పాలెగాళ్ళ అరుపులు. అంతటి ప్రశాంత వాతావరణాన్ని చూస్తూ పరవశించిపోతున్నాను.

ప్రజ్ఞ నా భుజంపై గట్టిగా తడుతూ,

"ఏయ్! ఏ లోకంలో కెళ్ళిపోయావ్? ఇంకా సేపు ఇలాగే కూర్చుంటే చీకటి పడిపోతుంది. పాములొచ్చి మన ఒళ్ళో చేరతాయి" అంది.

పాములంటే నాకు మహా భయం. అందుకే వెంటనే లేచాను. ఇంతలో దూరంగా మోటర్ సైకిల్ శబ్దం వినిపించింది.

"అన్నయ్య వస్తున్నట్టున్నాడు" అంది ప్రజ్ఞ.

ఒక నిమిషం తర్వాత ప్రజ్ఞ అన్నయ్య సునీల్ మోటర్ సైకిల్ మీద మా దగ్గరకు వచ్చాడు.

"మీరింకా ఇక్కడే వున్నారే! ఈపాటికి అక్కడికి చేరిపోయి వుంటారనుకున్నాను" అన్నాడు.

"లేదు. ఈ మొద్దు నడవలేనని మొండికేసింది. అందుకే ఇక్కడ కూలబడ్డాం" అంది ప్రజ్ఞ.

"ఇద్దరూ సర్దుకోగలమంటే నా మోటర్ సైకిల్ ఎక్కండి" అన్నాడు సునీల్.

రెండు క్షణాలు తటపటాయించినా ఆ తర్వాత సరేనన్నాను.

రణగొణ ధ్వనులను భరిస్తూ, పొగవల్ల మండిపోతున్న ముక్కు, కళ్లను తుడుచుకుంటూ, చికాకుపడుతూ ప్రతిరోజు సిటీ రోడ్లపై ప్రయాణించడానికి అలవాటుపడిన నాకు ఈ ప్రయాణం వింత అనుభూతిని కలిగించింది. పది నిమిషాల్లో ఒక చెరువుగట్టు దగ్గరకు చేరుకున్నాం.

అక్కడి వాతావరణం అంతా చూస్తుంటే ఏదో అద్భుతలోకంలోకి అడుగుపెట్టినట్టనిపించింది. ఒక ప్రక్క చెరువు, మరోప్రక్క గట్టుకు కొద్ది దూరంలో పెద్ద దిబ్బ. దానిపై రెల్లుగడ్డి కప్పిన పర్ణశాల వంటి కుటీరం. ముందు అందమైన పచ్చిక మైదానం. కుటీరం చుట్టూ పూలమొక్కలు.

ఒక కుగ్రామం శివార్లలో ఇంత అందంగా రూపు దిద్దుకున్న ఆ పరిసరాలను చూస్తూ తన్మయత్వం చెందాను.

"ఏమిటలా చూస్తున్నారు? మా చిన్న కాటేజ్ బాగుందా?" అని అడిగాను సునీల్.

"బాగుండడమా! బ్రహ్మాండంగా వుంది. ఇలాంటి లొకేషన్స్‌ని నేను ఫైవ్ స్టార్ హోటల్స్, క్లబ్ ఓపెన్ ప్లేసెస్‌లో చూశాను" అన్నాన్నేను.

"చూశావా! పట్టణాల్లో, నగరాల్లో ఇలాంటివి సంపన్నులకే పరిమితం. కాని ఈ పల్లెల్లో అందరికీ ఇలాంటివి అందుబాటులో వుంటాయి" అంది ప్రజ్ఞ.

నాకు ఎక్కడో చదివిన కొన్ని వాక్యాలు జ్ఞప్తికి వచ్చాయి.

'పల్లెల్లో ప్రజలు ప్రకృతితో మమేకమై జీవిస్తుంటారు. పట్టణాల్లో ప్రజలు కృత్రిమంగా ప్రకృతిలాంటి ఆకృతులను మలచుకుని వాటిని చూసి మురిసిపోతుంటారు.'

ఆ మాటలు అక్షరాలా నిజమనిపించింది.

చెరువు ప్రక్కనే చిన్న ప్లాట్‌ఫారంలా ఒక ఏర్పాటు వుంది. అక్కడ ముగ్గురం ముఖం, కాళ్ళు చేతులు కడుక్కున్నాం. ఎంతో ఫ్రెష్‌గా అనిపించింది. ఇంతలో సునీల్ తాటిముంజలు తెచ్చాడు. వాటి లోపలి నీళ్ళు ఒలికిపోకుండా తినడానికి శతవిధాల ప్రయత్నించాను. వాళ్ళిద్దరు అవలీలగా తినగలిగారు కాని నావల్ల కాలేదు.

"ముంజలు, చెరుకుగడలు తినడం కూడా ఓ కళే! తెలుసా?" అంది నవ్వుతూ ప్రజ్ఞ.

చెరువులోనే చేతులు కడుక్కుని చెరువు నీళ్ళు తాకీ తాకనంత దూరంలో ముగ్గురం కూర్చున్నాం. ఆ క్షణంలో కనిపించిన ఓ కమనీయ దృశ్యం నన్ను పులకరింపజేసింది. నిశ్చలంగా వున్న చెరువు నీటిలో నిండు పున్నమి జాబిలి తళతళలాడుతూ దర్శనమిచ్చింది. ఆ దృశ్యం ఎంతో మనోహరంగా వుంది. చివాలున తలెత్తి ఆకాశం వైపు చూశాను. ఆకాశం నిండా నక్షత్రాలు. కదిగి ముత్యాల ముగ్గులు పెట్టినట్టు మెరిసిపోతున్నాయి.

"అమ్మో ఇన్ని నక్షత్రాలా?" అన్నాను ఆశ్చర్యంగా.

"మరీ అంత ఆశ్చర్యపోతావే! రోజూ చూసేవేగా!" అంది ప్రజ్ఞ.

"భలేదానివే. ఇంత స్పష్టంగా, ఇన్ని నక్షత్రాలను నేనెప్పుడూ చూడలేదు. ఎప్పుడో రాత్రివూట కరెంట్ పోయినవుడు గాలి ఆడక బయటికి వస్తే అవుడు నక్షత్రాలు, చందమామ కనిపించేవి. కాని ఇంత క్రిస్టర్ క్లియర్‌గా ఆకాశాన్ని చూడడం ఇదే మొదటిసారి" అన్నాను.

కొద్ది క్షణాల తర్వాత మళ్ళీ నేనే అన్నాను "ఇలాంటి ప్రదేశంలో జీవితాంతం వుండిపోవాలనిపిస్తోంది"

"ఇవుడలాగే అంటావ్. ఒకటి, రెండు రోజులు గడిస్తే బోరు కొడుతోందంటావ్. చాలామందికి పల్లెటూళ్ళంటే మహా చిరాకు. టైం గడవదు. నో ఎంటర్‌టైన్‌మెంట్ అంటారు. సెకన్లు లెక్కించుకుంటూ స్పీడ్‌గా సాగిపోతే వాళ్ళకి పల్లెటూళ్లు స్తబ్దంగా, నిర్జీవంగా వున్నట్టు అనిపిస్తాయి" అంది ప్రజ్ఞ.

"నీ సంగతి సరే! మీకు బోర్ అనిపించదా? ఇక్కడ స్టార్ టీవీ కనెక్షన్‌లాంటివి కూడా వుండవు కదా! టైమెలా గడుస్తుంది?" అని అడిగాను.

"ఇక్కడ టైం గడవకపోవడమనేదే వుండదు. కావలసినంత పని చేతినిండా వుంటుంది. అయినా శాటిలైట్ ఛానల్స్‌లో చూడడానికేముంటాయ్?" అన్నాడు సునీల్.

"అదేం? మొత్తం ప్రపంచాన్ని మన కళ్ళముందు ఆవిష్కరిస్తుంటాయి. లోకజ్ఞానం పెరుగుతుంది" అన్నాను.

రెండు నిమిషాల మౌనం తర్వాత సునీల్ అన్నాడు.

"శాటిలైట్ ఛానల్స్‌లో తాజ్‌మహల్‌ను చూపించేవుంటారు కదూ".

"అవును చూపించారు."

"అందులో ప్రతి అణువణువుని అతిదగ్గరగా చూసి ఎంతో ఆనందించి వుంటారు కదూ. అదే టీవీ స్క్రీన్ మీద"

"అవును."

"అయితే ఒక్కసారి ఆలోచించు. నిజంగా తాజ్ మహల్ ముందు నిలిచి దాని సోయగాల్ని ప్రత్యక్షంగా చూస్తే వచ్చే ఆనందం టీవీలో చూస్తే వస్తుందా?"

నేను ఆలోచనలో పడ్డాను. నిజమే. తాజ్‌మహల్‌ను ప్రత్యక్షంగా చూసేటప్పుడు కలిగే అనుభూతి మాటల్లో చెప్పలేనిది అనిపించింది.

"ఏదైనా అంతే.. కేవలం ప్రకృతే కాదు. ఈ లోకం, ఈ మనుషులు, ఈ మనస్తత్వాలు, జీవితాలు.. సంఘటనలు ఇవన్నీ ఒకదానికొకటి ఎంతో విభిన్నంగా వుంటాయి. వాటిని ప్రత్యక్ష అనుభవంలోకి తెచ్చుకుంటే, వాటినుంచి ఎన్నో విషయాలు అవగతమవుతాయి. అందుకే పెద్దలనేవారు ప్రపంచంలోకి వెళ్ళి ఎంత లోతుగా వెళ్తే అంత జ్ఞానం లభిస్తుంది. సముద్రం పైన కనిపించేవి అలలు, నీలిరంగు నీళ్ళు. కాని సముద్ర గర్భంలో అత్యద్భుతాలుంటాయి. వాటిని శోధించడం వల్లనే జ్ఞానం పెరుగుతుంది" అన్నాడు సునీల్.

రెండు నిమిషాల తర్వాత "మీరిక్కడ ఆశ్రమవాసం చేస్తూ మునులైపోతున్నట్టున్నారే" అన్నాను నవ్వుతూ. అప్పుడు ప్రజ్ఞ అంది.

"సునీల్ తనదైన జీవితాన్ని తాను అనుభవిస్తున్నాడు. అందులో తృప్తి, ఆనందం, అతనికి వున్నాయి. అన్నిటికీ మించి మనశ్శాంతి వుంది. అది లేకుండా కాంక్రీట్ జంగిల్స్‌లో రాళ్ళలా, మేలురకం నగిషీలు దిద్దిన రాళ్ళలా బ్రతకడం అతనికిష్టం వుండదు. కక్షలు, కార్పణ్యాలు, సంకుచిత మనస్తత్వాలు, కుఛ్చితవు ఆలోచనలు, పన్నాగాలు, అనుమానాలు- ఇవన్నీ మన చుట్టూ వుండే పరిసరాల వల్లనే ఏర్పడతాయన్నది అతని విశ్వాసం. అందుకే వాటికి దూరంగా నిర్మలంగా, నిశ్చింతగా పదిమందికీ చేతనైనంత సాయపడుతూ జీవితం గడపడం సునీల్ కిష్టం" అంది ప్రజ్ఞ.

సునీల్ యువకుడు. కాని నా కళ్ళకు అతడు ఎన్నో అనుభవాలను జీర్ణించుకున్నవాడిలా కనిపించాడు. అప్పటికే చాలా చీకటి పడడంతో లేచి తిరిగి ఇంటికి వచ్చేశాం. కాని ఆ రోజు గడిపిన ఆ కొద్దిగంటల సమయాన్ని తలచుకున్నప్పుడల్లా నాకనిపిస్తుంది... ఎంతో విలువైన జీవితాన్ని అర్థంలేని గమ్యాలకోసం వృధా చేస్తున్నానేమోనని.

సునీల్ నిరంతరం దేనికోసమో అన్వేషిస్తున్నట్టు ఎక్కడెక్కడో, కొన్ని సంవత్సరాలపాటు తిరిగాడని, ఎంతో లోకజ్ఞానాన్ని సంపాదించాడని, అతని ప్రపంచం ఎంతో విస్తృతమైనదని ప్రజ్ఞ చెప్పింది. కాని మన ప్రపంచం? చాలా.. చాలా చిన్నది. అందుకే అందులో ఒదిగి వుండలేక ఇబ్బందులు పడుతుంటాం. కూపస్థ మండూకంలా జీవితం గడిపేస్తుంటాం- అనిపిస్తుంది.

— 'మోతీలాస్య'